బస్ సాపులోంచి మాట్లాడుకున్నట్లుగా పావలా రిక్షావాడి చేతిలో పెట్టాడు. కేసర్థ మయింది రిక్షావాడికి.

"క్యా సాబ్" చిక్కడపల్లినుంచి వస్తే చారనా దేతేహై?"

"అసలెంతకి మాట్లాదేవోయ్?"

"ఏక్ రుపయాచార్ అనాసాబ్"అంటూ గోపాలం చెప్పబోయేలోపున సైంధవుడిలా అడుపడ్డాడు రిక్షా మనిషి.

"రూపాయిపావలా అంటే నయమేనండి. మొన్న అత్తయ్యగారు చిక్కడపల్లినుంచి యిక్కడికొచ్చినపుడు రెండు రూపాయలు తీసుకొన్నాడు.

"ఏడిశావ్....నువ్వు లోపలకి ఫో."

అంటూ పెళ్ళాన్ని కేకలేసి, అందరి ముందు బింకంగా రిక్షావాడికి రూపాయి పావలా యిచ్చేసి, సిగరెటు వెలిగించి, డబ్బుల విషయం పట్టించుకోనట్లుగా పెర్రీ మేసన్ లో తోచిన పేజి వెర్రిగాతీసి కంటిన్యూగా చదువుతున్న వాడిలా మయసభలో దుర్యోధనుని ఫోజుతో గుమ్మాన్ని దాటబోయి మరదలి చెంబు తన్నబోయి తమాయించుకొని తాగినవాడిలా తూలుతూ లోపలకు వెళ్ళాడు ఫోజుగా గోపాలం.

బస్ సాపులోంచి పావలాకి కుదిరిన బేరందగ్గర రూపాయిపావలా కొట్టినందుకు యమ 'ఫోజు' ఫీలయ్యాడు రిక్షావాడు. ●

---

జబల్ పూర్ రైల్వేస్టేషన్‌లో గంగా-కావేరి ఎక్స్‌ప్రెస్ ఉదయం పదిన్నరకు వచ్చి ఆగింది.

సూట్ కేస్ తీసుకుని మెల్లగా దిగాడు సురేష్.




చుట్టూ కలయచూశాడు. అంతా హిందీ మాటలే విన్పిస్తున్నాయి. మచ్చుకైనా తెలుగు మాట విన్పించడం లేదు. మధు కోసం కొంతసేపు అటూయిటూచూశాడు. కానీ అతనికి మధు కన్పించలేదు. సురేష్‌కు కొంచెం భయం వేసింది. ఆంధ్రను వదలి అంత దూరం వెళ్ళడం తనకదే మొదటిసారి. హిందీ తనకు ఓ ముక్క కూడా రాదు. ఓ వేళ మధు యిక్కడికి రాకపోతే తనేమిటి చేయడం? సరాసరి అడ్రసు వెతుక్కుంటూ వెళ్ళాలి. ఆ కొత్త ప్రదేశంలో భాష తెలియని ప్రాంతంలో తను ఎలా మధు అడ్రసు వెతుక్కుంటూ వెళ్ళడం?

"హలో"– అంటూ ఎవరో భుజం మీద చేయి వేశారు.

ఉలిక్కిపడి తిరిగి చూశాడు సురేష్.

"మీరు సురేష్ అనుకొంటాను—" న్నాడు మధు.

"అవునండీ మీరు మధుబాబు కదూ?"

"యస్. రండిబయటకి వెళ్దాం."

రైలు ఎక్కే దిగే వాళ్ళతో స్టేషన్ చాలా రద్దీగా ఉంది. యిద్దరూ స్టేషన్ బయటికొచ్చారు.

"మీ సిస్టర్ శిరీష బాగుందా?" అడిగాడు మధు.

"బాగుందండి. మిమ్మల్ని మరీ మరీ అడిగినట్లు చెప్పమంది."

"ఆవిడను కూడా తీసుకు రాలేకపోయారా?"

"ఇంత దూరం పంపడానికి యింట్లో ఒప్పుకోరండి. అన్నట్టు మీకోసం స్పెషల్‌గా స్వీట్సుచేసి నా దగ్గర యిచ్చి పంపింది"– చెప్పాడు సురేష్.

ఇద్దరూ టాంగాలో ఎక్కి కూర్చున్నారు. టాంగా స్పీడుగా వెళుతోంది. సురేష్ కూర్చునే చుట్టూ చూస్తున్నాడు. పదకొండు గంటలవుతున్నా యింకా చలిగానే వుంది. మధుబాబుకు చాలా ఆనందంగా వుంది. తన కోసం శిరీష ప్రత్యేకంగా స్వీట్లు చేసి పంపింది. దీనిని బట్టి తనంటే శిరీషకు చాలా యిష్టమనే విషయం తేటతెల్లమైపోతోంది. ఇప్పుడు తను వాళ్ళన్నయ్య సురేష్‌ను బాగా అతిథిగా సత్కరిస్తే సురేష్ అభిమానాన్ని కూడా చూరగొనవచ్చు. తిరిగి తిరుపతి వెళ్ళాక తనను ఎలా ట్రీట్ చేసింది శిరీషతో చెప్పకపోడు.

టాంగా యింటి ముందాగడంతో యిద్దరూ దిగేశారు.

ఆరాత్రి వరకు హాయిగా కబుర్లు చెప్పుకొన్నారు. ఇంట్లో వాళ్ళందరికీ మధు సురేష్‌ను పరిచయం చేశాడు. మధు



ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. ఆటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి. Address

Samaj Kalyan (R.L. 78)
(P. O) Katri sarai (Gaya)

కాయకల్ప చికిత్స

ఈ చికిత్సవలన 3 లేక 4 మాసములలో జుట్టు రాలిపోవుట ఆగిపోయి, దట్టముగా వెంట్రుకలు పెరుగును. అకాలములో నెరసినవెంట్రుకలు నల్లబడును. చత్వారం తొలగిపోయి కండ్లజోడుతో నిమిత్తములేకుండామంచి చూపు వచ్చును. కదలిపోయిన పండ్లు మరల బిగిసిపోవును. తల్లి గర్భమునుండి జన్మించినప్పుడు దేహమునకు ఏ రంగు వున్నదో మరల ఆ రంగువచ్చి సౌందర్యము అభివృద్ధియగును.

వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రూ 4-00లు యం.ఓ పంపవలయును.

మేనేజరు

శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు,
విశాఖపట్టణము-17.

సురేష్‌ను వాళ్ళ చెల్లెలికి పరిచయం చేస్తున్నప్పుడు ఆమె మీది నుంచి చూపులు మరలించుకోలేక పోయాడు సురేష్. ప్రబంధనాయికి లాంటి ఆమె రూపాన్ని పదేపదే దొంగ చాటుగా చూస్తుండిపోయాడా రోజంతా సురేష్. మరుసటి రోజు జబల్‌పూర్ అంతా చూపించాడు మధు. జబల్‌పూర్‌కు ప్రక్కన నర్మదా నది వద 'బేడాఘాట్' అనే సుందరమైన ప్రదేశం వుంది. దానిని కూడా సురేష్‌కు చూపెట్టాడు.

మరుసటి రోజు గంగా-కావేరీ ఎక్స్‌ప్రెస్‌లో వారణాసికి తీసుకపోయి అక్కడ గంగానదిని, కాశీవిశ్వనాథుని గుడిని బెనారస్ యూనివర్సిటీని యింకా చాలా చాలా ప్రదేశాలను సురేష్‌కు చూపెట్టాడు మధు. సురేష్‌చేత పైసా కూడా ఖర్చు కానీయకుండా అన్ని ఖర్చులు తనే భరించాడు మధు. చివరకు అయిదారు రోజుల తరవాత తిరుగు ప్రయాణంలో ట్రైన్ టిక్కెట్ కూడా తనే తీసి యిచ్చాడు సురేష్‌కు. ఆ రోజు సాయంత్రంసురేష్‌ను గంగా-కావేరి ఎక్స్‌ప్రెస్ ఎక్కించాక వంద రూపాయలు యిచ్చి 'బేడాఘాట్' సీన్ కొని తన ప్రెజెంటేషన్‌గా శిరీషకు యివ్వమన్నాడు మధు.

"మై స్వీట్ శిరీషా! నీ కోసం మీ అన్నయ్యకు నాలుగైదు వందలు ఖర్చు పెట్టాను. అమాయకుడినేమీ కాదు. ఈ దెబ్బతో నువ్వు నన్ను ప్రేమిస్తావు. ప్రేమించి తీరుతావు. ఆరు నెలల క్రితం పెన్ ఫ్రెండుగా పరిచయమై అమాంతంగా నా గుండెను లాక్కున్నావు" అనుకుంటూ ఆమె ఫొటోను గట్టిగా ముద్దెట్టుకొన్నాడు మధు. "అమాయకుడా! అమ్మాయిలాగా ఉత్తరాలు రాసిన పుణ్యానికే అయిదొందలు ఖర్చుపెట్టి కాశీని చూపించావ్" అనుకొంటూ ట్రైన్‌లో నవ్వుకొన్నాడు సురేష్. ●

---

**అనకాపల్లి లాంటి నగరంలో పదిహేను రోజులు వరుసగా సెలవులు గడపడం అంటే కష్టమే.**

నెల పూర్తయాకగాని ఆ నెల పుస్తకాలు కనిపించని గ్రంథాలయాలు, ప్రేక్షకుల్ని తలనొప్పితో బాధించడమే మాజీవిత ధ్యేయం-అన్నట్టుగా ప్రదర్శించే సినిమా హాళ్ళతో మూర్తి విసుగెత్తిపోయాడు.




తను ఈ సెలవులన్నీ ఎలా గడపాలా అని అతి తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. ప్రతిరోజు రైల్వేస్టేషనుకు, ఆర్. టి. సి. బస్. స్టాండుకు వెళ్ళడానికి నిర్ణయించుకున్నాడు.

వచ్చే పోయే పాసింజర్లలో అందమైన ఆడవార్ని చూసూ ఆనందంగా ఫీలవసాగాడు. టైంకూడా చాలా చక్కగా గడిచిపోతుంది.

అందమైన అమ్మాయిలు ఒంటరిగా వస్తే విష్ చేసేవాడు. జంటగా వస్తుంటే ఆమె ప్రక్కనున్న మగాడ్నిచూసి ఈర్ష్య పడేవాడు. బస్సులోనో, ట్రెయిన్‌లోనో ఓరగా కూర్చున్న అమ్మాయిల్నిచూసి విష్ చేసేవాడు. బండి కదలగానే చేయిఊపుతూ టాటా చెప్పేవాడు. కొందరమ్మాయిలు నవ్వుకునేవారు. కొంద రదోలా చూసేవారు. మరికొందరు తిట్టుకునేవారు.

"మీది మద్రాసుకదూ ?" ఒంటరి అమ్మాయిల్ని పలకరించేవాడు.

"...."కొందరు నిర్లక్ష్యంగా పోయేవారు.

"నన్ ఆఫ్ యువర్ బిజినెస్" అంటూ విసురుగా పోయేవారు కొందరు.